


# నీళ్ళు తెచ్చుకునే చీరె

స్కూలు వదిలేశారు. గోడల కంటించిన సినిమా పోస్టర్లు చూసుకుంటూ ఇంటికి వస్తూంటే వసంత పిన్ని వాకిట్లో నిలబడి ఉంది. "పాపా! కొంచెం ఇటు వస్తావా?" అని అడిగింది. "కొంచెం ఏం ఖర్మ పూర్తిగా వస్తాను" అని అటు వెళ్ళాను.

ఆవిడ అర్జెంటుగా ఒక చీరె కొనుక్కోవాలిట. "కొంచెం మీ అమ్మతో చెప్పి నాకు సాయం చేస్తావా?" అని అడిగింది.

నాకు బజారు పన్లంటే భలే సరదా! అందులోనూ బట్టల బేరం అంటే మరింత ఉత్సాహం తన్నుకొస్తుంది.

'ఇప్పుడే వస్తా' అని చెప్పి పరుగున ఇంటికి వెళ్ళాను. అమ్మతో విషయం చెప్పాను. "సరే వెళ్ళు. ఆరిందారి గోవిందమ్మలాగా పుట్టమీదివీ పురంమీదివీ కబుర్లు చెప్పకు. ఆవిడ అడిగిందానికి సమాధానం చెప్పి ఊరుకో. ఆవిడ చెప్పిన మాట విను. చెప్పిన పని చెయ్యి" అని లక్ష జాగ్రత్తలు చెప్పింది అమ్మ.

యూనిఫారం మార్చుకుని మామూలు బట్టలు వేసుకుని పాలు తాగి బయలుదేరి వెళ్ళాను.

వసంత పిన్నీ వాళ్ళ పుట్టింటివాళ్ళు చాలా గొప్పవాళ్ళుట. ఈవిడని చాలా గారాబంగా పెంచారుట. ఏనాడూ గడపదాటి ఎరుగదట. పరాయివాళ్ళతో మాట్లాడాలంటే చెమటలు పట్టేస్తాయిట.

గొప్ప సంబంధం చేశారు. వసంతగారి భర్త పెళ్ళినాటికే పెద్ద ఆఫీసరుట. ఆ పెళ్ళినాటి ముచ్చట్లు చెప్పుకుని నవ్వుకుంటూ ఉంటే విన్నాను. పెళ్ళిలో ఆవిడవైపు బంధువులంతా పెళ్ళికూతుర్ని కావలించుకునే కూర్చున్నారుట.

అప్పగింతలప్పుడు తెల్లవారుజామున మొదలుపెట్టిన కార్యక్రమం ఏడుస్తూ పూర్తిచేసేసరికి తెల్లవారిపోయిందిట.

ఆ తర్వాత 'ఒంటరి కాపురం' అని వాళ్ళంతా వచ్చి దిగబెట్టి పదిహేను రోజులుండి ప్రయాణం అయితే వసంత శోకాలు పెట్టి ఏడ్చిందిట. తల్లీ అదే వరసట. ఆ ఏడుపు భరించలేక తల్లితో పిల్లనీ పంపించారుట. మళ్ళీ రెండు వారాల తర్వాత అటునించి ప్రయాణం. పిల్ల ఏడుస్తుంటే తల్లీ ఏడ్చి వెంట వచ్చిందట. పదిహేను రోజుల తర్వాత ఏడుస్తూ తల్లి ప్రయాణం అయితే పిల్లా ఏడుపు మొదలుపెట్టిందిట. తల్లీ పిల్లా వెళ్ళిపోయారు.

ఈ శివభారతంతో విసిగిపోయిన వసంత భర్త "ఇట్లా ఏడ్చి మొత్తుకునేట్లయితే మీ అమ్మాయిని మీ ఇంట్లోనే అట్టే పెట్టుకోండి. నా ఏడుపు నేనేడుస్తాను" అన్నాడుట.

దాంతో ఠారెత్తి ఏడుపు ఆపి పిల్లని కాపురానికి దిగబెట్టారుట. వాళ్ళు మాకు దూరపు బంధువులుట. వెళ్తూ మా ఇంటికొచ్చి "అభం శుభం తెలియని అమాయకురాలు. ఓ కంట కనిపెట్టి ఉండండి" అని మా అమ్మకు చెప్పి ఏడ్చిందిట.

"అయ్యో! దానికేం భాగ్యం" అని హామీ ఇచ్చిందిట అమ్మ. తరచూ వెళ్ళి చూసి వస్తూ ఉండేది. "అదేం అమాయకత్వం బాబూ? ఈరోజుల్లోనూ ఇలాంటి వాళ్ళున్నారంటే ఆశ్చర్యమే!" అనేది అమ్మ.

ఆ వసంత పిన్నీ నేనూ బజారుకి బయలుదేరాం. మా ఇంటికి దగ్గరలో ఉన్న కొట్టుకి తీసికెళ్ళాను.

నన్ను ఆదరంగా పలకరించి కుశల ప్రశ్నలు వేశారు కొట్టువాళ్ళు. "అంతా బాగానే ఉన్నాం. ఇదుగో మా పిన్ని గారు. మంచి చీరెలు చూపించండి. ధర కూడా కచ్చితంగా చెప్పాలి" అన్నాను గంభీరంగా.

వాళ్ళు చీరెలు చూపించడం మొదలు పెట్టారు. పట్టు చీరెలూ జరీ చీరెలూ సిల్క్ చీరెలూ...కళ్ళు చెదిరేలా ఉన్నాయి.

"ఇవి కాదండీ. నాకు నీళ్ళు తెచ్చుకునే చీరె కావాలి" అంది వసంత పిన్ని భయంభయంగా.

వాళ్ళు అయోమయంగా చూసి 'ఓ! దానికేం' అని ఇంకొన్ని చీరెలు ముందు పడేశారు.

"అయ్యో! ఇవన్నీ కాదండీ. నాకు నీళ్ళు తెచ్చుకునే చీరె కావాలి' అంది పిన్ని దీనంగా.

వాళ్ళు చేతులెత్తేశారు.

"పోన్లే పిన్నీ, ఇంకోచోటికి వెళ్దాం పద" అన్నాను. ఇద్దరం పక్క షాపుకి వెళ్ళాం. అక్కడా ఇదే గొడవ. అలా నాలుగు షాపులు తిరిగి రిక్షా కట్టుకుని కొత్తపేట వెళ్ళాం.

"నీళ్ళు తెచ్చుకునే చీరెలు ఉన్నాయా అండీ?" అని అడిగాను ముందు జాగ్రత్తగా.

"ఉన్నాయి రండి!" అన్నాడు. నా ప్రాణం లేచివచ్చింది. చీరెలు తీసి "ఇదుగో చూడండి- నేత ఎంత బావుందో, నీళ్ళు మూట కట్టవచ్చు" అన్నాడు.

"ఆహాఁ ఇది కాదండీ. నీళ్ళు తెచ్చుకునే చీర" అంది వసంత పిన్ని. వాళ్ళూ చేతులెత్తేశారు. అక్కడినించీ రిక్షా మాట్లాడుకుని పెద్ద బజారు వెళ్ళాం.

మళ్ళీ వేట మొదలు. ఎన్ని షాపులు తిరిగినా నీళ్ళు తెచ్చుకునే చీరె దొరకలేదు. నాకు నీరసం వస్తోంది, ఆకలేస్తుంది.

"చీకటి పడుతోంది పిన్నీ. అమ్మ కోప్పడుతుంది వెళ్దాం, మళ్ళీ రేపు వద్దాం. అదీగాక బాబాయిగారొచ్చే వేళయింది" అన్నాను.

రిక్షాలో ఇద్దరం ఇంటిదారిపట్టాం. సగం దూరం వచ్చేసరికి కళ్ళు తుడుచుకోవడం మొదలుపెట్టింది పిన్ని. ఇల్లు చేరేసరికి ఏడుపెక్కువ అయింది.

"అదేవిటి పిన్నీ! ఎందుకేడుస్తున్నావ్?"

"అదికాదు పాపా! నీళ్ళు తెచ్చుకునే చీరె కాస్తా పోయింది. రేపు నేను నీళ్ళెలా తెచ్చుకుంటాను?" అంటూ బోరుమంది.

నాకు చచ్చేంత భయంవేసింది. పిన్ని దగ్గర్నుంచి డబ్బులు తీసుకుని రిక్షావాడికిచ్చి పంపించి మా ఇంటికి పరిగెట్టాను.

'ఇంతాలస్యం అయిందేం' అంటున్న అమ్మను వారించి అసలు విషయం చెప్పేశాను. అమ్మ కంగారుగా పిన్ని దగ్గరకు వెళ్ళింది. నేనూ వెళ్ళాను. అమ్మను చూసి మళ్ళీ ఏడ్చింది పిన్ని. 'ఊరుకో చిట్టి, అసలు ఏం జరిగిందో చెప్ప'మంది. ఏడుపాపుకుంటూ చెప్పింది పిన్ని.

పుట్టింటివారు పెట్టెడు చీరెలిచ్చారుట. ఇదుగో ఇది కాఫీలు కలిపేటప్పుడు కట్టుకో, ఇది కట్టుకుని నీళ్ళు తెచ్చుకో, ఇది వంటకి, ఇది పూజకి, ఇవి పెళ్ళిళ్ళకి, ఇవి సినిమాలకీ షికార్లకీ అని చిలక్కి చెప్పినట్లు చెప్పిందిట వాళ్ళమ్మ. ఆ మాటలే తు.చ. తప్పకుండా ఆచరిస్తోందిట పిన్ని.

అవేళ నీళ్ళు తెచ్చుకుని, బావిదగ్గరే పిండి ఆరేస్తే అదికాస్తా ఎవరో ఎత్తుకుపోయారుట.

ఆ రంగూ, పూలూ ఉన్న చీరె కోసమే బజారంతా గాలించింది. దొరకలేదు.

"ఇప్పుడెట్లా అక్కయ్యగారూ! అయినా సినీమాలకీ షికార్లకీ బోలెడేసి చీరెలు ఇచ్చి, నీళ్ళకీ వంటకీ ఒక్క చీరె ఇస్తే ఇటువంటి ఆపద సమయంలో నేనేమైపోతాను?" అంది దీనంగా.

అమ్మ ఒకటే నవ్వు. "ఓసి వెర్రిమొహమా! ఏదో చిన్నపిల్లవి తడబడతావని సులువుకోసం చెప్తే అదే పట్టుకు కూర్చున్నావా? అదిపోతే ఇంకో చీరె కట్టుకుని నీళ్ళు తెచ్చుకో" అని తెలియజెప్పింది.

ఇంటికివస్తూ "ఆడపిల్లలని మరీ ఇంత అమాయకంగా పెంచకూడదు. గారాబం చేసినా కాస్త లోకజ్ఞానం కూడా ఉండేలా జాగ్రత్తపడాలి" అంది అమ్మ.

* * *